ఆర్థిక సాయం అందజేత

గన్‌ఫౌండ్రీ: జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికురాలు రేణుక మృతిపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ సంతాపం వ్యక్తం చేసింది. యూనియన్ అధ్యక్షుడు ఉదారి గోపాల్ ఉస్మానియా ఆసుపత్రిలో ఆదివారం బాధిత కుటుంబాన్ని కలిసి రూ.10 వేలు అందజేశారు. బషీర్‌బాగ్ –లిబర్టీ ప్రాంతంలో విధుల్లో ఉండగా టస్కర్ వాహనం ఢీకొని మరణించడం బాధకరమన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు బి.కన్న, సంజీవ్ కుమార్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



చాంద్రాయణగుట్ట: మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్–ఉన్–నబీని పురస్కరించుకుని చాంద్రాయణగుట్ట బండ్లగూడలో మజ్లిస్ నాయకుడు మహ్మద్ అబ్దుల్ పర్వేజ్ సోదరుల బృందం ఆదివారం అన్నదానం నిర్వహించింది. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి



ఆనంద్‌కుమార్ గౌడ్‌ను సత్కరిస్తున్న స్థానికులు

అబిడ్స్: బీఆర్‌ఎస్ హయంలోనే గోషామహల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అబిడ్స్, ట్రూప్‌బజార్, ఎంజే మార్కెట్, గోషామహల్‌లో ఆదివారం ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంజే మార్కెట్, ట్రూప్‌బజార్‌లో డ్రైనేజీ సమస్యలను వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించినందుకు స్థానికులు ఆయనను సత్కరించారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

ఆలయాల మూసివేత



బంజారాహిల్స్: రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లోని ఆలయాలన్నీ ఆలయ అర్చకులు, అధికారులు మూసివేశారు. ఆదివారం ఉదయం ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం 12 గంటల తర్వాత ఆలయాలను మూసివేశారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, అయ్యప్ప స్వామి ఆలయం, శివాలయాల్లో ఉదయం పూజల అనంతరం ఆలయాన్ని మూసివేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస శర్మ తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం 8 గంటల తర్వాత ఆలయ సంప్రోక్షణ అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని పూజలు పూర్తయిన తర్వాతే భక్తులకు దర్శనం ఉంటుందని ఆయన వెల్లడించారు.

పార్కులో లైట్లు ఏర్పాటు చేయాలి

అత్తాపూర్: పెద్దతాళ్లకుంట పార్కులో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులతో పాటు పలుమార్లు ఎలక్ట్రిసిటీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కేవలం పండుగ సందర్భాలలో మాత్రమే కళ్లు జిగేల్ మనిపించే విధంగా విద్యుత్ కాంతులు విరజిమే విధంగా నగరం పరిసర ప్రాంతాలు వెలిగిపోతున్నాయి. గత 40 రోజులుగా పార్కులో ఏ ఒక్క లైటు వేలగకపోవడంతో వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. పాడైన లైటింగ్ స్థానంలో నూతనంగా లైటింగ్ వ్యవస్థను ఆధునికరించాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ పరిశ్రమలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాలివీ... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టాటానగర్‌లో పెట్ బాటిల్ అండ్ స్క్రాప్ మెటీరియల్స్ పరిశ్రమ ఉంది. రోజూ మాదిరిగానే శనివారం రాత్రి కంపెనీని మూసి కార్మికులు వెళ్లిపోయారు. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగ వ్యాపించింది. స్థానికులు విషయాన్ని రాజేంద్రనగర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో స్టేషన్ ఆఫీసర్ చంద్రనాయక్ నేతృత్వంలో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు వెల్లడించారు. ప్రమాద సమయంలో కార్మికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

సిమెంట్ స్తంభాల ఏర్పాటెన్నడో..?

- పాతబస్తీలో శిథిలావస్థకు చేరిన ఇనుప స్తంభాలతో దడ
- గత విద్యుత్ ప్రమాదాల నేపథ్యంలో స్థానికుల్లో భయందోళన



గౌలిపురా హనుమాన్ నగర్‌లో ప్రమాదకరంగా ఇనుప స్తంభం



షాక్ తగలకుండా చంచల్‌గూడలో ఇనుప స్తంభానికి చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

చార్మినార్: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన పురాతన ఇనుప స్తంభాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. తుప్పుపట్టినవి కొన్నైతే.. వంగిన స్తంభాలు మరికొన్ని..మరొకొన్నింటికి ఇన్సులేషన్ మార్చకపోవడం.. మరోవైపు గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదాల నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన స్తంభాలతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్‌వి ఏర్పాటు చేయాలని పాతబస్తీ ప్రజలు కొన్నేళ్లుగా ఫిర్యాదు చేస్తున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పాతబస్తీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల ముందున్న ఇనుప స్తంభాలతో పాటు ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలు స్థానికులకు భయాందోళన కలిగిస్తున్నాయి.

టీజీఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలంలో..

టీజీఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలంలో చార్మినార్, ఆస్మాన్‌ఘడ్, బేగంబజార్ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు లక్ష వరకు ఇనుప స్తంభాలు ఉన్నాయని సంబంధిత శాఖ అధికారి ఒకరు తెలిపారు. కేవలం ఆస్మాన్‌ఘడ్ డీఈ పరిధిలోని ఒక్కో ఏఈ పరిధిలో 3 వేల ఇనుప స్తంభాలు..ఇలా మొత్తం డివిజన్‌లో 30 వేల వరకు పాత ఇనుప స్తంభాల ఉంటాయని అధికారుల అంచనా. ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో ఒక్కో ఏఈ పరిధిలో శిథిలాస్థకు చేరిన 30–40 వరకు ఇనుప స్తంభాలను తొలగిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

వేలాడుతున్న విద్యుత్ వైర్లు ..

చార్మినార్, ఆస్మాన్‌ఘడ్, బేగంబజార్ డివిజన్ల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ.. ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్, గాంధీనగర్, హమాలీబస్తీ, ఎస్టీ కాలనీ తదితర బస్తీల్లో ఎన్నో ఏళ్లుగా స్థానికులు ఎల్టీ, హెచ్‌టీ వైర్లతో ప్రమాదాలు జరుగుతున్నాయని సంబంధిత అధికారులకు విన్నవించగా కేవలం ఎల్టీ విద్యుత్ వైర్ల స్థానంలో బంచ్ కేబుల్ (బీసీ) వైర్లను ఏర్పాటు చేశారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పాతబస్తీ వాసులు కోరుతున్నారు.

కార్వాన్‌లో ఎంపీ పర్యటన



ఎంపీ అసదుద్దీన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ డివిజన్‌లో ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదివారం పర్యటించారు. జీఎంకే ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ఫిల్లింగ్ స్టేషన్ అధినేత పాషాభాయ్, షకీల్ ఆలీఖాన్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కులమతాలతో తమ పార్టీకి సంబంధం లేదని ప్రజా సేవ చేయడమే తమ ప్రథమ లక్ష్యమన్నారు. పార్టీలో దళితులు, బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తూ వస్తున్నామన్నారు. అలాగే యువ వ్యాపారవేత్త జీఎంకే ఫిల్లింగ్ స్టేషన్‌కు చెందిన షకీల్ అలీఖాన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్, కార్పొరేటర్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులు ఉన్నారు.

సంఘ్ నాయకుల వేషధారణలో చిన్నారులు



చాంద్రాయణగుట్ట: ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిమజ్జన యాత్రలో టస్కర్ వాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. లలితాబాగ్‌లోని ముక్కెరబస్తీ శ్రీ సుభాష్ చంద్రబోస్ గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు సంఘ్‌ను స్థాపించిన కేశవ్ బలీరాం హెగ్డేవార్, శ్రీ మాదవ్ సదాశివ గోల్వాల్కర్‌తో పాటు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ చిత్రాలతో పాటు విపత్తుల సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ చేసిన సేవా కార్యక్రమాల చిత్ర పటాలు, చిన్నారులతో సంఘ్ కార్యకర్తల వేషాధారణలు వేయించారు. ఈ సందర్భంగా గణేశ్ మెడలోని 16 మీటర్ల శాలువాను కమిటీ అధ్యక్షుడు ఎడ్ల పండరీనాథ్ రూ.లక్షకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో కమిటీ చీఫ్ అడ్వయిజర్ వి.నర్సింగ్ రావు, అడ్వయిజర్ వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి రూపేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గురువులను గౌరవించాలి



గన్‌ఫౌండ్రీ: గురువులను పూజించే గొప్ప సంస్కృతి మనదని సరస్వతి ఉపాసకుడు దైవాజ్ఞశర్మ అన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వతి పరిషత్‌లో చిరాగ్ డ్యాన్స్, ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురుదేవోభవ పేరిట జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడారంగంలో జాతీయస్థాయిలో రాణిస్తున్న షాన్వి, ఇషికాతో పాటు పలువురు గురువులను సన్మానించారు. అంతకుముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యువ హీరో సిద్ధార్థ్ సాయి, డాక్టర్ నాగబాబు, సమాజ సేవకులు షేక్ శంషీర్, ప్రిన్సిపాల్ ఎస్.ఉదాయ్‌కుమార్, సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్‌కె.సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన సదస్సు



డాక్టర్ ఎస్.కిషన్

అబిడ్స్: స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 1న ప్రారంభమైన 'సుస్థిర శక్తి వాతావరణంలో మార్పులు' అనే అంశంపై నిర్వహించిన అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం ఆదివారం ముగిసింది. కన్వీనర్ కో ఆర్డినేటర్‌గా డాక్టర్ కెఎల్.వసుంధర, కోఆర్డినేటర్‌గా ఎం.మధవి వ్యవహరించారు. ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్శిటీ మ్యాథమెటిక్స్ సీనియర్ ప్రొఫెసర్ ఎస్.కిషన్ హాజరై ప్రసంగించారు. బొగ్గు, పెట్రోలియం ఉపయోగించడం వల్లే వాయు కాలుష్యం అవుతుందని పరిశ్రమల నుంచి విడుదలయ్యే రసాయనాల వల్ల నీరు, నేల కాలుష్యమవుతుందన్నారు. సౌరశక్తి, వాయుశక్తి, జీవ ఇంధనాలు, హైడ్రోజన్ టెక్నాలజీ మనకు భవిష్యత్తును అందించే సాధనమని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 13 మంది ఆచార్యులు, శాస్త్రవేత్తలు ప్రసంగించారు. వారం పాటు జరిగిన అటల్ అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమానికి చీఫ్ ప్యాట్రన్‌గా బిషప్ ఏ సైమాన్, కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ కె.కృష్ణారావు వ్యవహరించారు. ప్యాట్రన్‌గా కళాశాల డీన్, ప్రొఫెసర్ వినయ్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎల్.రాజు వ్యవహరించగా కోర్సు కో ఆర్డినేటర్లుగా డాక్టర్ జి.శిరీష, డాక్టర్ విద్యా భార్గవి వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణమూర్తి, ఆర్.అండ్.బి డైరెక్టర్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, మొదటి సంవత్సరం డైరెక్టర్ వి.అనురాధ, అడ్మినిస్ట్రేషన్ అధికారి ఆకుల రమేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా 250 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

బోసిపోయిన 'బడా గణేశ్' చౌరస్తా



ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి వినాయక ఉత్సవాలతో నిత్యం లక్షలాది మంది భక్తులతో పుణ్యక్షేత్రాన్ని తలపించిన ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తా ఆదివారం బోసిపోయి దర్శనమిచ్చింది. రోజూ లక్షలాది మంది భక్తులతో అడుగు తీసి అడుగు వేయలేనంత మంది రద్దీతో దర్శనమిచ్చిన ఖైరతాబాద్ పరిసర ప్రాంతాలు శనివారం ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనోత్సవం పూర్తి కాగానే ఆదివారం బోసిపోయి దర్శనమిచ్చింది.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



గోల్కొండ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మెహిదీపట్నం సంతోష్‌నగర్ పార్కు యోగా సెంటర్ ప్రతినిధి ఈశ్వర్‌జోషి అన్నారు. పార్కులో యోగా క్లబ్ సభ్యులతో ఆదివారం మాట్లాడుతూ.. వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా యోగా సాధన చేయవచ్చన్నారు. త్వరలోనే పార్కులో యోగాకు వచ్చే వారికి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

డంప్ యార్డ్‌ను వేరే ప్రాంతానికి తరలించాలి



శివకుమార్‌యాదవ్

జియాగూడ: జియాగూడ కమేలా వద్ద గల చెత్త డంపింగ్ యార్డ్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని కార్వాన్ నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్ శివకుమార్ యాదవ్ కోరారు. ఈ మేరకు ట్యాంక్‌బండ్‌లోని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ దుర్వాసనాతో దోమల బెడద, జాతీయ రహదారిలో వెళ్లే ప్రయాణికులు, పాదాచారులు డంపింగ్‌యార్డ్‌కు వచ్చే వాహనాల వల్ల ట్రాఫిక్ జామ్‌తో గంటల తరబడి నిలిచిపోతున్నారన్నారు. అధికారులు సత్వరమే తగు చర్యలు చేపట్టాలని కోరారు.

తెలంగాణలో ప్రజా రంజక పాలన



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో మిత్రకృష్ణ

గోల్కొండ: తెలంగాణలో ప్రజా రంజకంగా పాలన సాగుతుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా మాజీ ఎస్సీ సెల్ చైర్మన్ మిత్ర కృష్ణ ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి అభినందించారు. టీపీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ ముందుకెళ్తున్నారన్నారు. మరోవైపు మహిళా సాధికారత కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు.



మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానించిన మమతా గుప్తా, సంతోష్‌గుప్తా

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సంతోష్‌గుప్తా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం ప్రగతి, అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు.

'మనోహర్ మృతి పార్టీకి తీరని లోటు'

చార్మినార్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర స్మారక కమిటీ నాయకుడు మనోహర్ మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, నాయకులు కన్నయ్య లాల్, బహదూర్ పురా నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అర్ధరాత్రి వరకు కొనసాగిన నిమజ్జనోత్సవాలు



చార్మినార్ వద్ద పోలీసు అధికారులతో డీసీపీలు స్నేహా మెహ్రా, రక్షిత మూర్తి

చార్మినార్: పాతబస్తీ శివారులోని బాలాపూర్ నుంచి శనివారం ఉదయం ప్రారంభమైన నిమజ్జనోత్సవ శోభాయాత్ర అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగింది. బాలాపూర్, చాంద్రాయణగుట్ట, షంషీర్‌గంజ్, అలియాబాద్, శాలిబండ, మక్కా మసీదు, చార్మినార్, పత్తర్‌గట్టి, మదీనా, నయాపూల్ ద్వారా అఫ్జల్‌గంజ్ మీదుగా ట్యాంక్‌బండ్‌కు చేరింది. నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా, హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షిత మూర్తి తదితరుల ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద బందోబస్తులోని పోలీసు అధికారులు, ఉత్సవాల నిర్వాహకులు, శాంతి సంఘం సభ్యులు, భక్తులను వారు అభినందించారు. నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

అందరి సహకారంతోనే నిమజ్జనం ప్రశాంతం



మైత్రి కమిటీ సభ్యులతో సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ కృష్ణగౌడ్ తదితరులు



పోలీసు అధికారులను సన్మానిస్తున్న జాహెద్ అలీ

గోల్కొండ: అందరి సహకారంతోనే గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని టోలిచౌకి డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షులు జాహెద్ అలీ గోల్కొండ పీఎస్‌లో పోలీసులను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. వినాయక నవరాత్రోత్సవాలు ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు తీసుకున్న ముందస్తు చర్యల వల్లే శాంతియుత వాతావరణంలో జరిగాయన్నారు. త్వరలోనే వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపు ప్రశాంతంగా జరిగిన సందర్భంగా మండపాల నిర్వహకులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ కృష్ణగౌడ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, టోలిచౌకి ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేశ్‌నాయక్, గోల్కొండ డీఐ రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.



గణేశ్ నిమజ్జనం చేస్తున్న భక్తులు

గోల్కొండ: వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో గోల్కొండ జీఎంకే గార్డెన్‌లో మహ్మద్ ఉస్మాన్ ఆధ్వర్యంలో గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కృష్ణగౌడ్ మాట్లాడుతూ.. మండపాల నిర్వహకులు, భక్తులు పోలీసుల సూచనలు పక్కాగా పాటించడం వల్లే నిమజ్జనం ప్రశాంతంగా జరిగిందన్నారు. కార్యక్రమంలో గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, కుల్సుంపురా డివిజన్ ఏసీపీ మహ్మద్ మునావర్, స్పెషల్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణరెడ్డి, పీస్ కమిటీ అధ్యక్షుడు ఆబేద్, ప్రధాన కార్యదర్శి ఇలియాస్ అలీ, మహ్మద్ షానవాజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.



గణేశ్ విగ్రహాలకు స్వాగతం పలుకుతూ..

అబిడ్స్: గణేశ్ నిమజ్జనం ఆదివారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. పలు స్వాగత వేదికలపై గణేశ్ విగ్రహాలకు స్వాగతం పలికారు. గుడిమల్కాపూర్, గోషామహల్, బేగంబజార్, ఎంజే మార్కెట్, అబిడ్స్ ప్రాంతాల్లో రాత్రివేళ సైతం స్వాగతం పలుకుతూ.. అల్పాహారాలు, తాగునీటి సరఫరా చేశారు. కొంత మంది అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు





గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాట్య శిక్షణాలయం నర్తనం ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నృత్య గురువు సంధ్యారాణి శిష్యులు హరిణి రాజ్యలక్ష్మి, శరణ్యశ్రీల కూచిపూడి ఆరంగేట్రం రవీంద్రభారతిలో ఆదివారం కనుల పండువగా జరిగింది. దంతం భజే, హర హర హర శంభో, దుర్గా తరంగం, ప్రహ్లాద పట్టాభిషేక శపతం, థిల్లానా వంటి అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. ఉన్నత విద్యను అభ్యశిస్తూ శాస్త్రీయ సంగీత కళలను నేర్చుకోవడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ భాగవతుల సేతురాం, కూచిపూడి నాట్య గురువు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రీ, రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర్‌రావు, నాట్య కళా మయూరి ఆర్.ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాల అందజేత



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: రెడ్డి జన సంఘం (అబిడ్స్) ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని రెడ్డి హాస్టల్‌లోని పేద విద్యార్థులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదివారం ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 307 మంది విద్యార్థులకు రూ.26.22 లక్షలు విలువైన చెక్కులు అందజేశామన్నారు. నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు సంఘం కృషి చేయడం ఎంతో అభినందనీయమన్నారు. అలాగే రెడ్డి జన సంఘం ప్రధాన సలహాదారు ప్రొఫెసర్ కంచర్ల దశరథ్‌రెడ్డి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వేమ్‌రెడ్డి నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండు రంగారెడ్డి, ఉపాధ్యక్షులు సుకన్యరెడ్డి పాల్గొన్నారు.

పాతబస్తీలో పర్యాటకుల సందడి..!



చార్మినార్: పాతబస్తీలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొన్నది. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే చార్మినార్ కట్టడాన్ని చూసేందుకు నగరంలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా విదేశీయులు సైతం పెద్ద సంఖ్యలో తరలిరావడంతో చార్మినార్ పరిసరాలు రద్దీగా మారాయి. హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియం, చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, నెహ్రూ జూలాజికల్ పార్కు కిటకిటలాడాయి. అయితే నయాపూల్ నుంచి గుల్జార్‌హౌజ్ వరకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.